# కారని కన్నీరు

బస్‌స్టాండ్ దగ్గర రిక్షా ఆగింది. చంద్రం రిక్షా చార్జీ ఇచ్చేసి ఎంక్వయిరీ ఆఫీసువైపు నడక సాగించాడు. ఎదురుగా వస్తున్న బస్సులను తప్పించుకుంటూ ముందుకు వెళ్లడం కాస్త కష్టం అయింది.

ఎంక్వయిరీ కౌంటర్లోని గుమస్తా రెండు నిమిషాల తర్వాత కాని అతన్ని పట్టించుకోలేదు. ఇంతకూ ఆ ఊరికి ఇక్కడ నుండి నేరుగా బస్సు లేదు.

"అయితే యిప్పుడు ఆ ఊరికి వెళ్లడం ఎట్లా?" అని అడిగాడు. ఎంక్వయిరీలోని ఆసామీ "ఆ ఊరికి ఫాస్ట్ పాసింజర్ వుంది. దాన్లో వెళ్లి వెనక్కు రండి. మీ అదృష్టం బాగుంటే కండక్టర్ అడ్డ రోడ్డు దగ్గర ఆపినా ఆపవచ్చు" అన్నాడు.

"ఆ బస్సు యిప్పుడేదయినా సిద్ధంగా వుందా?"

"ఆ... నంబర్ ప్లాట్‌ఫారం మీద వుంది. వెళ్లండి త్వరగా"

చంద్రం అటు వైపు నడక సాగించాడు.

రాజధానికి వెళ్లి తిరుగు ప్రయాణం చేస్తూ యిక్కడ ఆగాడు చంద్రం. ఉన్నట్లుండి - ఆ ఊరు వెళ్లడం, అప్పటి పాత పరిసరాలు అవీ ఎలా వున్నాయో చూడడం కాస్త మార్పుగా వుంటుంది గదా అనుకున్నాడు. ఒక రోజు విశ్రాంతి తీసుకుందాం అనుకున్నాడు ముందు. కాని వెళ్లి రావడం తమాషాగా వుంటుంది. ఆ పని ఎందుకు చేయగూడదు - అనిపించింది. అంతే! అదృష్టం బావుండి యిప్పుడు బస్ కూడా సిద్దంగా వుంది.

టికెట్ తీసుకుని తనకు కేటాయించిన జాగాలో కూర్చున్నాడు. చేతిలోని బ్రీఫ్ కేస్ నెత్తిమీది "లైట్ లగేజ్ రాక్"లో వుంచితే దాని గీతలన్నీ దీని మీద ముద్రితం అవుతాయి. అందుచేత వొళ్లో పెట్టుకు కూర్చోడమే బుద్ధికి లక్షణం అనిపించింది. తన ప్రయాణానికి చిహ్నం బ్రీఫ్‌కేస్ మీద ఎందుకు వుండాలి? పక్క సీటులో ఇంకా మనిషి లేదు గనుక ఆ జాగాలో వుంచాడు

బ్రీఫ్‌కేస్ ప్రస్తుతానికి. దారిపొడుగునా యిక్కడికి ఎవరూ రాకుండా వుంటే మరీ మంచిది. తాను విరామంగా, సజావుగా ప్రయాణం సాగించేయవచ్చును.

బస్సు బయలుదేరుతూ వుండగా కూడా సోడాలు అమ్మే వాళ్లు రద్దీగా లోపలకు వస్తూనే వున్నారు. ప్రయాణికులు రణగొణధ్వనులు చేస్తూ మాట్లా డుకుంటున్నారు. 'నిశ్శబ్దంగా బ్రతకడం మనిషికి ఎంతమాత్రం ఇష్టంలేదని రుజువు చేయటానికి మన రైల్వేస్టేషన్లు, కాఫీ హోటళ్లు, బస్‌స్టాండ్‌లు, దుకాణాలు బాగా పనికివస్తాయి' అనుకున్నాడు చంద్రం.

తప్పనిసరి అయిన పని వున్నప్పుడు తప్ప ప్రయాణాలు చేయనివాడు గదా తను! ఇలా కులాసా కోసం వినోదం కోసం తిరగడం కాస్త 'రిలీఫ్'గా వుంటుంది.

రాజధానిలో మూడురోజులు యమ రద్దీతో నిమిషం తీరుబడి లేకుండా తిరిగింది కాక, అంతపొడుగునా రైల్లో ప్రయాణం చేసి వచ్చిన తరువాత ఈ పట్టణంలో ఒకరోజు విశ్రాంతి తీసుకోవడం తనకు ప్రతిమారు అలవాటే. కాకపోతే యిప్పుడు తీరి కూర్చుని కావాలని మరో బస్సు ప్రయాణం కూడా పెట్టుకున్నాడు.

నిజానికి ఆ ఊరు వెళ్లాలనీ, వెనకటికీ, ఇప్పటికీ యేమైనా మార్పులు వచ్చినాయేమో – గ్రామ పంచాయితీల మండలాల ఏర్పాట్లు వచ్చిన తర్వాత మార్పు రాకుండా వుండడం సాధ్యమా? ఈ మార్పులలో తను అప్పటి స్కూలు, ఆట స్థలాలు, దుకాణాలు, యిళ్లు గుర్తు పట్టగలనా - అని చూచుకోవాలని, చాలా సంవత్సరాల నుండి మనసులో కోరిక సన్నగా వుంది. కాని ఎప్పటికప్పుడు సమయం తన చేతుల్లో వుండకపోవడం, తర్వాత చూచుకోవచ్చునులే అనే తాత్సారంతో వాయిదా వేస్తూ వచ్చాడు. చేయాలనుకున్న పనులు వాయిదా వేస్తూ పోవడంలోనే మనకు నిజమైన ఆనందం వుంది.

నిజానికి ఆ గ్రామంతో అతని కేమీ అనుబంధంలేదు. తండ్రిగారి ఉద్యోగ రీత్యా అక్కడ ఎలిమెంటరీ స్కూల్లో మూడేళ్లు చదివాడు; అంతే! పది - పన్నెండేళ్ల మధ్య వయసు - ఆ కుగ్రామంలో జరిగిపోయింది. 'హయ్యర్ ఎలిమెంటరీ స్కూల్' అనే వాళ్లు అప్పుడు. ఎనిమిదో క్లాసు పరీక్ష పాసయిపోవడంతోనే తమ కుటుంబం అక్కడ నుంచి తరలి వెళ్లింది.

తరువాత హైస్కూలు చదువంతా ఒక వూళ్లో, కాలేజీ చదువు మరో పట్టణంలో అయిందనిపించుకుని మదరాసు చేరుకున్నాడు. అక్కడి యూనివర్సిటీలో డాక్టరేట్ సంపాదించుకుని ఉద్యోగరీత్యా ఈపదేళ్ల లోనూ అనేక నగరాలు చూచాడు. దేశంలోని ఏ మూల నుంచి మరే మూలకు వెళ్ళినా

ఈ పట్టణం తగలడం వల్లనూ, అక్కడే తన వాళ్లందరూ స్థిర నివాసం ఏర్పర చుకుని వుండడం చేత, యిక్కడ తప్పనిసరిగా మకాం ప్రతి ప్రయాణంలోనూ!

అయితే తనలాగ ఎవరూ మళ్లీ ఆ కుగ్రామం చూడాలని, అక్కడి పరిసరాలు గుర్తు పట్టాలని అనుకుని వుండరు. ఎవరితోనైనా ఈ రకమైన ప్రస్తావన తీసుకు వద్దామని ఒకటి రెండుమార్లు మనసులో అనిపించినా, యిలాంటి అనవ సరపు వ్యాపకాలు ఆలోచించడం నాగరక లక్షణం కాదని పైకి మాట్లాడకుండా వుండిపోయాడు.

ఎలిమెంటరీ స్కూల్లో తనతోపాటు చదివినవాళ్లు కూడా ఎవరూ అతని మనుసులో మెదలడం లేదు, ఒక్క 'రాజు' తప్ప. రాజు, తను ఎప్పుడూ ఒకే బెంచి మీద కూర్చునే వాళ్లు; పుస్తకాలు, పాఠాలు ఒకరికొకరు చూపుకునే వాళ్లు. ఆటపాటలలోను కలిసిమెలిసి వుండేవాళ్లు.

ఆ మూడు సంవత్సరాలు ఎలా తిరిగారో అంతే! తరువాత ఒకళ్లకూ, మరొకళ్లకూ యే మాత్రం సంబంధం లేదు. బాగా బుద్ధి తెలిసిన తర్వాత కాలేజీలో చదువుకున్న స్నేహితులతోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకుంటూ స్నేహం కొనసాగించడం కుదరలేదు తనకు. ఇక ఎప్పుడో చిన్న తరగతులలో వుండిన 'రాజు'తో ఆ ప్రసక్తే లేదు!

కాకపోతే రాజు ఆ గ్రామానికి స్థానికుడు. అక్కడే వాళ్లకు పొలాలు, పుట్ర వున్నాయి. ఒకటో రెండో యిళ్లు వున్నాయి. తనలాగే రాజు కూడా పై చదు వులు చదువుకుని ఉద్యోగాల వేటలో దూరదేశం వెళ్లి వుంటాడని అనిపించలేదు చంద్రానికి.

తరువాత యేమయినా కలిగినారేమో గాని, ఆ తల్లిదండ్రులకు తనకు తెలిసినంత వరకు రాజు వొక్కడే కొడుకు. ఆస్తిపాస్తులు చూచుకుంటూ స్వగ్రా మంలోనే హాయిగా వుండి వుండాలి. పోనీ లేదనుకుందాం - అతన్ని గురించి వివరం అయినా తెలుస్తుంది గదా. వాళ్లవాళ్లు యెవరో యింకా అక్కడే వుండి వుండాలి. రాజు తండ్రిది అప్పట్లో పెద్ద సమిష్టి కుటుంబం. ఎప్పుడు చూచినా యింటినిండా మనుషులు, పిల్లలు, పాలేర్లు, పశువులు!

తన అంచనా ప్రకారం రాజు ఆ వూరి చదువుతో ఆపివేసి వుండాలి. అంటే అప్పటికి ఎనిమిదో క్లాసే అక్కడి ఉన్నత విద్య. ఈ రోజుల్లో అయితే దాదాపు ప్రతి ఊరికీ జూనియర్ కాలేజీలు వొచ్చేశాయి గాని అప్పుడు కాలేజీ అంటే దాదాపు యాభయి మైళ్లు బస్సు ప్రయాణం చేస్తేగాని కుదరదు. అప్ప టికి ఇంకా విద్యాలయాలు 'ఎడ్యుకేషనల్ షాప్స్' కాలేదు.

ఆ గ్రామంలో బస్ ఆగే సరికి సాయంత్రం అయిదున్నర అయింది. దుమ్ము రేపుకుంటూ బస్సు రోడ్డు మీద ఆగడం తోటే కొందరు కుర్రాళ్లు "కూలీ, కూలీ" అంటూ ఎగబడ్డారు.

మొక్కజొన్న కంకులు, జామకాయలు, మురుకులు బుట్టల్లో పెట్టుకుని అమ్మేవాళ్ల అరుపులు ప్రయాణికులను ఏమీ తోచకుండా చేస్తాయి, కనీసం కొన్ని నిమిషాలు. సోడా కుర్రవాళ్ల అల్లరి సరేసరి!

చంద్రం బ్రీఫ్ కేస్ తీసుకుని బస్సు దిగాడు.

అతనుకాక యింకా నలుగురు అక్కడ దిగారు. చంద్రం యింకా రోడ్డు మీదనే నిలబడి వున్నాడుగాని వాళ్లు మాత్రం చకచక యెవరో తరుముకు వస్తున్నట్లుగా ముందుకు పరుగులు తీసుకుంటూపోయారు.

చంద్రం బస్సు వెళ్లి పోయేంతవరకు రోడ్డు వారగా నిలబడ్డాడు.

ఊరంతటికీ అదే మెయిన్ రోడ్.

ఒకవైపు పొడుగ్గా వెడితే 'మునియేరు' వస్తుంది. సాయంత్రం పూట అప్పుడప్పుడు అక్కడికి షికారుగా వెళ్లడం, స్నానం చేయడం, ఈత నేర్చుకుందుకు ప్రయత్నం చేయడం స్ఫురణకు వచ్చింది - చంద్రానికి. ఈ ఏటి తీరంలో ఎప్పుడో రెండు మూడు వందల సంవత్సరాల క్రితం 'స్వదేశ సంస్థానాధీశ్వరు' లిద్దరికి యుద్ధం లాంటిది జరిగిందని కూడా అతను యేదో చరిత్ర పుస్తకంలో చదివాడు.

మరోవైపు వెడితే ఒక 'గ్రామ దేవత' ఆలయం వస్తుంది. ఆమెకు మంచి 'మహోత్మ్యం' వుంది. ఈ చుట్టు పక్కల యిరవై, ముప్పై గ్రామాలవాళ్లు ఆమెకు జాతరులు చేస్తూ వుంటారని, ప్రతి సంవత్సరం వేడుకలు ఘనంగా జరుగుతాయని విన్నట్లు గుర్తుకు వచ్చింది. తను కాలేజీలో చదువుతూ వున్నప్పుడు ఈమె మహోత్మ్యాన్ని గురించి 'సినిమా' కూడా వచ్చింది. కానయితే తను చూడటం పడలేదు.

దూరం నుంచి బడి గంటలు వినిపించాయి. రెండు మూడు నిమిషాలలో పిల్లలు పుస్తకాల సంచులు భుజాలకు తగిలించుకుని యిళ్లకు వెళ్ళిపోతూ కనిపించారు. కొందరు పిల్లలతో పాటు తల్లులు కూడా కనిపించారు. మధ్య వయస్సు వాళ్లను చూచినప్పుడు 'వీళ్లు నాతోపాటు అప్పుడు బడిలో చదువుకునే వుండాలి!' అనిపించింది చంద్రానికి. అయినా యెవరూ తనకు పరిచయం లేదు. గుర్తు చేసుకో ప్రయత్నం కూడా కాలం వృథా. అయితే ఆ స్కూలు

యింకా అక్కడే వున్నదన్నమాట.'

రాజు యిల్లు ఈ రోడ్డు మీద యెటుపోతే వస్తుందో చంద్రానికి తెలుసును. కాకపోతే నేరుగా యింటికి వెళ్లడమేనా లేక ఎవరినైనా వాకబు చేస్తే మంచిదా అని రెండు నిమిషాలు తటపటాయించాడు.

అయిదు నిమిషాలలో తనకు తెలిసిన రాజు యిల్లు వచ్చేసింది. ఇంటి ముందు నిలబడి విశ్రాంతిగా చూచాడు, చంద్రం మరోమారు. అవును, ఇదే యిల్లు సందేహం లేదు!

అరుగులు యెక్కి తలుపు తట్టాడు.

తలుపులు దగ్గరగా వేసి వున్నాయి.

రెండు మార్లు కాస్త బలంగా తట్టినందువల్ల తలుపులు తెరుచుకున్నాయి.

వెంటనే యెవరూ కనిపించలేదు. చంద్రం చొరవగా ఒక అడుగు ముందుకు వేశాడు.

లోపల నుంచి ఒకామె వచ్చింది. దాదాపు యాభయి, యాభయి అయిదేళ్లు వుంటాయి ఆమెకు అనుకున్నాడు చంద్రం.

"ఎవరు కావాలి నాయనా"

"రాజశేఖరం యిల్లు యిదే కదండీ?" అన్నాడు తటపటాయిస్తు. రాజశే ఖరం తల్లి కాదని అతని అనుమానం.

"ఎవరు రాజా? అవును బాబు... ఇదే రాజశేఖరం ఇల్లు - ఎవరు బాబూ మీరు?"

"నేను చంద్రశేఖరాన్నండీ. రాజుకు స్నేహితుడిని - చిన్నప్పుడు. మాది ఈ వూరు కాదు, చూచిపోదామని వచ్చాను."

ఆమె చంద్రశేఖరాన్ని ఎగాదిగా చూచింది.

ఆమె అలా చూడడం అతనికి అయోమయం అనిపించడమే కాకుండా కాస్త 'సిగ్గు' కూడా అనిపించింది.

'కూర్చో బాబూ' అంది ఆమె.

"రాజశేఖరం ఇంట్లో ఉన్నాడండీ?" అన్నాడు చంద్రం, దగ్గర్లో ఉన్న కుర్చీలో కూర్చుందుకు ప్రయత్నిస్తూ, ఆమె మళ్ళీ అతని వంక ఎగాదిగా చూచింది. ఈ మారు పెద్దగా నిట్టూర్చింది కూడా. "అయితే మీకు తెలవదా బాబూ?" అనడిగింది.

"ఏమిటండీ?" అన్నాడు తాపీగా కూర్చుంటూ చంద్రం.

ఆమె ఏమీ బదులు చెప్పకుండా లోపలకు వెళ్ళిపోయింది.

బహుశా రాజశేఖరం ఇక్కడ ఉండటం లేదేమో తనలాగే ఉద్యోగంలో ఊరు వదలి వెళ్ళిపోయాడేమో అనుకున్నాడు.

రెండు మూడు నిమిషాలలో ఆమె మళ్ళీ ఇవతలకు వచ్చింది. ఈ మారు వెండి గ్లాసుతో మజ్జిగ తీర్థం తీసుకువచ్చింది. "కాస్త దప్పిక తీర్చుకో నాయినా" అంటూ అతనికి అందించింది. "నిమ్మకాయ పిండాను" అంది అతను తాగుతూ ఉండగా..

"అయితే యే ఊరు బాబూ మనది?" అనడిగింది. అతను ఖాళీ గ్లాసు మేజా మీద పెట్టివేయడంతో.

"బెంగుళూరులో ఉంటున్నానండీ. రాజూ, నేను ఇరవైయేళ్ల కిందట ఈ ఊళ్లో చదువుకున్నాం కలిసి. మిమ్మల్ని చిన్నప్పుడు చూచినట్లు లేదు. అయినా నాకు గుర్తు ఉండటం కూడా అంతంత మాత్రమే లెండి. రాజు తల్లిగారా మీరు?" అనడిగాడు చంద్రం.

"కాదు బాబూ. వాడి తల్లీ, తండ్రీపోయి అయిదారేళ్లు అయిపోయింది. వాడి తల్లి నాకు వరుసకు అక్కయ్య అవుతుంది. మేమంతా చిన్నప్పటి నుంచి ఒకచోట పెరిగిన వాళ్ళమే" అంది ఆమె.

రాజు తల్లి దండ్రులు ఇద్దరూ పోయారని తెలుసుకొని చంద్రం నిట్టూర్చు విడిచాడు; బాధగా సంతాపంగా.

"అయితే రాజు ఊళ్ళో లేడాండీ?" అనడిగాడు.

"లేడు, నాయనా లేడు" అంది ఆమె. కంఠం గద్గదం అవడమూ, తనవైపు సూటిగా చూడలేక పోవడమూ, కొంగుతో ముఖం కప్పుకుందుకు ప్రయత్నించడమూ, కళ్ళు తుడుచుకోవడమూ... గమనించాడు చంద్రం.

"అయితే రాజు ఎక్కడ ఉంటున్నాడు?" అని అడిగాడు.

"ఈ భూమి మీద వాడికి నూకలు చెల్లిపోయాయి బాబూ! ఎక్కడ ఉంటున్నాడని చెప్పను?" అన్నది ఆమె - ఇందాకటి కంటె అతి దారుణమయిన స్థితిలో.

కూర్చున్న కుర్చీ విరిగి నేలకు పడిపోయినట్లు, తను కుప్పకూలిపోయినట్లు అనిపించింది చంద్రానికి.

"ఏమయింది రాజుకు? అయ్యో! అయ్యో! ఇంత దారుణమైన మాట

వినడానికా వచ్చాను!" అన్నాడు తనలో తాను గొణుగుకుంటున్నట్లుగా.

"అప్పుడే మూడు నెలలు అయింది బాబూ! అంతా గ్రహచారం!"

"నాకు చాలా బాధగా ఉందండీ. ఈ సంగతే తెలియదు నాకు. ఊరికే చూచిపోదామని వచ్చాను. ఎంత దారుణం జరిగింది!"

"తల్లీ తండ్రీపోయిన తర్వాత ఈ ఆస్తులన్నీ అమ్మేసి పట్టణం వెళ్ళిపోదామనుకున్నాడు. కాని మేమెవరం ఒప్పుకోలేదు. ముఖ్యంగా వాడి భార్య ససేమిరా అన్నది. అందుకని ఇక్కడే ఉండి వ్యవసాయం పనులన్నీ చూచుకుంటూ ఉండేవాడు. ఊరు మారినా పోయిగా ఉండేవాడేమో. ఏం చేసినా, నుదుట వ్రాసింది జరగకుండా పోతుందా నాయనా, నా పిచ్చిగాని. పుట్టి పెరిగిన ఊళ్ళోనే వాడికి ఋణం తీరిపోవాలని ఉండింది!"

"అతని భార్య, పిల్లలు ఎక్కడ ఉన్నారు?"

"ఈ ఊళ్ళోనే బాబూ. ఈ ఇంట్లోనే ఉంటే, బాబు గుర్తులతో తనకు బేజారు అయిపోతుందని, కాంతం - ఈ వీధి చివరనే మరో ఇల్లు ఉంది చూడు — అక్కడకు మారిపోయింది. ఏదీ, ఇంకా పదిహేను రోజులయినా కాలేదు. లంకంత ఇల్లు విడిచిపెట్టి ఊరుకోవటానికి చేతకాక - మనసురాక నేను ఇంకా ఇక్కడే తారట్లాడుతున్నాను."

ఈ వివరాలన్ని తనకు అనవసరం అనుకున్నాడు చంద్రం. తను వచ్చిన పని అయిదు నిముషాలలోనే అయిపోయింది. పుట్టెడు విచారం మూటగట్టుకుని తిరుగు ప్రయాణం చేయడం తప్ప తనకు ఇంకొక పనిలేదు ఇప్పుడు.

లేచి వెళ్లటానికి అన్నట్లుగా నిలుచున్నాడు. బ్రీఫ్‌కేస్ చేతిలోనికి తీసుకున్నాడు. తనేమయినా మాట్లడటానికి ముందే ఆమె "ఇంత దూరం ఎలాగూ వచ్చావు. చిన్ననాటి స్నేహితుడినంటున్నావు. ఈ రాత్రికి ఇక్కడే ఉండిపో బాబూ. అమ్మాయిని కూడా పలుకరించి వెళ్లు" అంది.

ఈ ఊహ తనకు తట్టనందుకు మనసులోనే నొచ్చుకున్నాడు. అతని భార్యను తను ఎరగడు. ఆ మాటకు వస్తే - అతన్ని మాత్రం ఎంత ఎరుగును? 'నువ్వు ఎవరో నాకు గుర్తు రావడం లేదు' అని రాజు అన్నా తను ఆశ్చర్యపోగూడదు అనుకుంటూనే వచ్చాడు తను.

"అలాగే. ఆమెను చూచి వెడతాను. ఆ పాత ఇల్లే గదా. నాకు గుర్తే అనుకుంటాను... వస్తానండీ...." అన్నాడు బయటకు అడుగులు వేస్తూ.

ఆమె ఆ ఇంటి గుర్తులు చెబుతూ వెనకనే నడిచి వచ్చింది వీధి గుమ్మం

దాకా. ఆమె దగ్గర సెలవు తీసుకుని చంద్రం రాజు భార్య ఉంటున్న ఇంటి వైపు నడక సాగించాడు.

అదే బజారు. అవే దుకాణాలు. కాకపోతే కాస్త కొత్త రంగులు అలుముకు న్నాయి. కను చీకటి పడుతోంది అప్పుడే.

రోడ్డు రెండు పక్కలా పరిశీలనగా చూచుకుంటూ నిదానంగా నడుస్తున్నాడు.

ఇంకెవరితోనూ మాట్లాడుదామనిగాని, ఊరిని గురించి వాకబు చేద్దామని గాని అనపించడం లేదు.

మనసంతా చేదెక్కిపోయింది.

ప్రతివాడూ ఎప్పుడో ఒకప్పుడు చనిపోవాలనీ, ఎవరు చనిపోయినా ప్రపంచ మేమీ మునిగిపోదనీ, అయిన వాళ్ళకైనా విచారం కొద్దికాలం మటుకే ఉంటుం దని... కాలం మనసుకు తగిలే గాయాలను మాన్పుతుందనీ... ఇలా యేవేవో వేదాంతం మాటలు నెమరు వేసుకుంటూ నడుస్తున్నాడు.

ఆ ఇంటి ముందుకు చేరుకున్నాడు. తలుపు తట్టాడు.

"తీసే ఉంది. రండి.." అని గొంతు వినిపించింది.

తలుపు నెట్టుకు లోపలకు వెళ్ళాడు.

అందంగా ఉన్న ఇంటి ముందు గదిలో నిలబడ్డాడు. సోఫాసెట్, మధ్య టీపాయ్.. దాని మీద పుస్తకాలు, పత్రికలు, గోడలకు రెండు మూడు వర్ణ చిత్రాలు.

సోఫాలో ఒకమూల ముప్ఫయి యేళ్ళలోపు మనిషి — ఆమె కాంతం — రాజశేఖరం భార్య — అయిఉండాలని చంద్రం అంచెనా వేసుకున్నాడు.

"రండి, ఎవరూ?" అంది ఆమె చంద్రాన్ని చూస్తూనే.

"నేను చంద్రశేఖరాన్ని—" అంటూ అతను తన "ప్రవర" చెప్పుకున్నాడు.

ఆమె సోఫాలోంచి లేచింది.

లైటుకాంతి ఈ మారు ఆమె ముఖం మీద పడుతోంది. 'అందమైన ముఖం' అనుకున్నాడు చంద్రం అంత విచారంలోనూ.

"కూర్చోండి. మిమ్మల్ని గుర్తు పట్టకపోవడం నాదే తప్పు. చంద్రం కదూ?" అంది ఆమె.

"మనం ఇది వరకు కలుసుకోలేదు. రాజశేఖరాన్ని కూడా ఇరవై ఏళ్ళ క్రితమే చూడడం. తరువాత నాకు అతని సంగతులే తెలియవు."

"నాకు గుర్తేలేండి. అప్పుడు నేను మీతో ఆడుకుంటూ ఉండేదాన్ని కదా!"

"మీ పుట్టిల్లు ఈ ఊరేనా?"

"రాజశేఖరం మేనత్త కూతురును నేను. మీ ఇద్దరికంటె మూడు తరగతులు క్రింద ఉండేదాన్ని. మీ ముఖం నాకు గుర్తే కూర్చోండి - నిలబడే ఉన్నారు."

చంద్రం సోఫాలో కూలబడ్డాడు.

ఆమెను గుర్తు తెచ్చుకుందుకు ప్రయత్నం చేసినా లాభంలేకపోయిది. ఆమెకు తన సంతాపం చెప్పి బయటపడడం తప్ప ఇప్పుడు తాను చేయవలసింది ఏమీ లేదు.

"పాత ఇంటికి వెళ్ళాను. ఆమె చెప్పారు. మీకు జరిగిన ఘోరానికి ఎలా పరామర్శ చేయాలో నాకు తెలియడం లేదు. రాజు లేడంటే... ఊహించుకో లేకపోతున్నాను."

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"మీరు జాగ్రత్తగా కాలక్షేపం చేసి, పిల్లలను పైకి తీసుకురావాలి" అన్నాడు ఏమీ అనకుండా ఉంటే బాగుండదని.

ఆమె అతని వంక మరింత దిగులుగా చూచింది. కళ్ళల్లో నీటి పొరలు కమ్ముకుంటున్నాయి. మటుమాయం అయిపోతున్నాయి.

ఆమె దుఃఖం దిగమింగుకుంటూ ఉన్నదనీ, ఎక్కువసేపు ఇక్కడ ఉండడం భావ్యం కాదనీ అనుకున్నాడు చంద్రం.

"వస్తానండీ... మీకు.."

"కూర్చోండి. ఇంత అభిమానంగా -- విషయం తెలియక పోయినా -- రాజశేఖరాన్ని చూచివెడదామని వచ్చారు. ఇప్పుడు ఎక్కడకు వెడతారు? ఈ ఊరు వదిలి వెళ్ళాలన్నా మీకు తెల్లవారితేగాని బస్సులేదు" అంది ఆమె.

లోపలకు వెళ్లి నాలుగు నిమిషాలలో వచ్చింది. కప్పులో వేడి వేడి కాఫీ అందించింది అతనికి.

"తీసుకోండి."

"మీకు లేనిపోని శ్రమ ఇస్తున్నాను."

"మీ స్నేహితుడు మీకు ఇచ్చిన శ్రమకంటె ఎక్కువా? తను లేకుండాపోయి, మిమ్మల్ని ఇక్కడకు పిలిపించుకున్నాడు; ఇన్నాళ్ళ తరువాత."

చంద్రం హృదయం కరిగిపోయింది ఆమె మాటలకు.

"పిల్లలెందరు?" అనడిగాడు కొన్ని క్షణాల తరువాత.

"ఒక్కడే కొడుకు. వారితోపాటు స్కూటర్ ఏక్సిడెంట్‌లోనే పోయాడు వాడు కూడా" అంది ఆమె.

చంద్రానికి మళ్ళీ తలబద్దలయిపోయింది. మిన్నూ, మన్నూ ఏకం అయినాయా? తల చేతులతో పట్టుకుని కిందకు వాల్చుకున్నాడు, ఆమె వైపు చూడటం చేతకాక. చాలాసేపు అయిన తరువాత "ఇక ముందు మీరు ఏం చేద్దాం అనుకుంటున్నారు?" అన్నాడు చంద్రం.

"ఇక్కడే ఉండి గ్రామ జీవిత వికాసానికి పనిచేస్తాను. రాజశేఖరం చేత ఈ పని చేయించాలనే ఇక్కడి నుంచి కదలనివ్వలేదు. ఆయన పోయారు గదా అని — నేను ఇక్కడ నుంచి పారిపోతే ఏమయినట్లు?" అంది ఆమె.

✽